

తల్లి పాలతోనే ఆరోగ్యం

నవజాత శిశువు ఆరోగ్య పెరగడానికి తల్లిపాలు దోహదపడతాయి. తల్లిపాలల్లో వివిధ రకాల పోషకాలు ఉంటాయి. 8లో ▸



అభివృద్ధి బాటలో పల్లెలు

బీఆర్ఎస్ పాలనలోనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. 8లో ▸

ఓయూ పరీక్షల తేదీల వెల్లడి

ఉస్మానియా యూనివర్సిటీ: వర్షాల కారణంగా ఇటీవల ఓయూ పరిధిలో జులై నెలలో జరగాల్సిన వివిధ కోర్సుల పరీక్షలు వాయిదా వేశారు. తాజాగా బీఏ, బీఎస్సీ, బీసీఏ, బీఫార్మ్ కోర్సుల వివిధ సెమిస్టర్ పరీక్షల నిర్వహణ తేదీలను సోమవారం విడుదల చేశారు. వివరాలను www.ormania.ac.in వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

న్యూస్‌రీల్

బీసీ ఐక్య వేదిక సమావేశాన్ని విజయవంతం చేయాలి

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

మీర్‌పేట: మంగళవారం నిర్వహించనున్న జిల్లా బీసీ ఐక్య వేదిక సమావేశాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. మీర్‌పేట మందమల్లమ్మ చౌరస్తాలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం బీసీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్లాపూర్‌లోని వైఏఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, జిల్లా పరిధిలోని బీసీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిద్దెల జితేందర్, టీపీసీసీ అధికార ప్రతినిధి సతీష్, ప్రధాన కార్యదర్శి జైపాల్, శేఖర్‌మామ, కొత్తకుర్మ శివకుమార్, మొయినాబాద్ దర్శన్, మండలాల అధ్యక్షులు మానయ్య, ఆవుల యాదయ్య పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు

ఆమనగల్లు: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులతో ప్రజలు, వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డా.వెంకటేశ్వర్‌రావు సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడిన అనంతరం ఆస్పత్రి వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్‌లో జ్వరాలు, కండ్లకలక వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మాస్‌మీడియా అధికారి శ్రీనివాస్, ఆస్పత్రి వైద్యాధికారి డా.పరిక్షిత్ నరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

విన్నపాలు వినవలె..



అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి అనూహ్య స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తమ సమస్యలు విన్నవించేందుకు తరలివచ్చారు. వారి నుంచి అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 343 ఫిర్యాదులు అందినట్టు తెలిపారు. ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలని సూచించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిశీలించాలని, ఫిర్యాదుదారులతో సానుకులంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల 'ఏర్పాట్లు' షురూ!

సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించిన ఏర్పాట్లను సైబరాబాద్, రాచకొండ పోలీసులు ప్రారంభించారు. ఇందులో భాగంగా సోమవారం రెవెన్యూ అధికారులతో కలిసి తొలి సంయుక్త సమావేశం నిర్వహించారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో ఇది జరిగింది. సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ.. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, ఎన్నికల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా స్వేచ్ఛగా ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రవర్తన నియమావళి, విధులపై అధికారులకు సంపూర్ణ అవగాహన ఉండాలన్నారు. రంగారెడ్డి కలెక్టర్ హరీశ్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సహకరించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

'సీత్లా'.. ఉల్లాసంగా

మున్సిపల్ పరిధిలోని విఠాయిపల్లిలో సోమవారం సీత్లా పండుగను ఉత్సాహంగా.. ఉల్లాసంగా జరుపుకొన్నారు. గ్రామంలోని గిరిజనులు తమ ఇంటినుంచి తలపై నైవేద్యంతో ఊరేగింపుగా వెళ్లి ముత్యాలమ్మ దేవతకు సమర్పించారు. పంటపొలాలు బాగా పండాలని, పశుసంపద బాగుండాలని మొక్కుకున్నారు. ఊరేగింపులో గిరిజనుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. సంబరాల్లో కౌన్సిలర్ సుజత, ఎస్‌ఐ బల్‌రాం తదితరులు పాల్గొన్నారు.

– ఆమనగల్లు



ఊరేగింపులో గిరిజనుల నృత్యాలు



హుక్కా కేంద్రంపై పోలీసుల దాడులు

పహాడీషరీఫ్: గుట్టు చప్పుడు కాకుండా కొనసాగుతున్న హుక్కా సెంటర్‌పై మహేశ్వరం జోన్ ఎస్‌వోటీ పోలీసులు దాడులు చేసి 25 మందిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎర్రకుంట ప్రాంతంలో అనుమతి లేని చిల్ హుక్కా పార్లర్‌పై ఎస్‌వోటీ పోలీసులు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. 25 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1,920 నగదు,28 సెల్‌ఫోన్లు, హుక్కా పరి కరాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వారిని బాలాపూర్ పోలీసులకు అప్పగించారు.

మురిసిన రథచక్రం



షాద్‌నగర్ డిపో

- ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం
- సంతోషం వ్యక్తం చేస్తున్న కార్మికులు

షాద్‌నగర్/ఇబ్రహీంపట్నం: ప్రత్యేక తెలంగాణ ఏర్పడితే రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను ప్రభుత్వంలో విలీనం చేస్తారని కొన్నేళ్లుగా ఆశగా ఎదురుచూస్తున్న ఆర్టీసీ కార్మికుల కల నెరవేరింది. సోమవారం కేబినెట్ సమావేశంలో టీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని నిర్ణయించడంపై కార్మికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టనున్నారు.

- షాద్‌నగర్ డిపోలో మొత్తం 47 బస్సులు, 39 అద్దె బస్సులు ఉన్నాయి. కండక్టర్లు, డ్రైవర్లు, ఇతర సిబ్బంది మొత్తం 360 మంది పని చేస్తున్నారు. కేబినెట్ నిర్ణయంతో వీరంతా ప్రభుత్వ ఉద్యోగులుగా మారనున్నారు.
- ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో 625 మంది పనిచేస్తున్నారు. 330 మంది కండక్టర్లు, 200 మంది డ్రైవర్లు, 80 మంది మెకానికల్ సిబ్బంది, మరో 15మంది ఆఫీసు సిబ్బందికి ఈ నిర్ణయంతో లబ్ధి చేకూరనుంది.

మహేశ్వరంలో డిపోలో 420 మంది..

మహేశ్వరం: ఆర్టీసీలో పని చేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో మహేశ్వరం ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న 420 మంది ఉద్యోగులు, సిబ్బంది సంబరాలు చేసుకున్నారు. డిపోలో 170 మంది డ్రైవర్లు, 150 మంది కండక్టర్లు, మరో 100 మంది టెక్నీషియన్లు, ఇతర సిబ్బంది ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ కష్టాన్ని గుర్తించినందుకు సంతోషంగా ఉందని తెలిపారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయించడం హర్షణీయం. ప్రభుత్వం సంస్థ అభివృద్ధితో పాటు, కార్మికుల సంక్షేమం కోసం నిర్ణయం తీసుకోవడం అభినందనీయం.

– నర్సింలు, విలేజ్ బస్ ఆఫీసర్, షాద్‌నగర్

కార్మికుల జీవితాల్లో వెలుగు



ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆర్టీసీ కార్మికుల జీవితాల్లో వెలుగు నింపింది. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో కార్మికుల ఉద్యోగానికి భద్రత లభిస్తుంది.

– తిరుపతయ్య, విలేజ్ బస్ ఆఫీసర్, షాద్‌నగర్

సంతోషకరమైన పరిణామం



ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం సంతోషకరమైన నిర్ణయం. సిబ్బందికి మరింత బాధ్యత పెరుగుతుంది. సంస్థను లాభాల బాటలో పయనించేలా శాయశక్తులా పనిచేస్తాం. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినందుకు ధన్యవాదాలు.

– అశోక్‌రాజు, డీఎం, ఇబ్రహీంపట్నం

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



ఆర్టీసీని ప్రభుత్వరంగంలో విలీనం చేయడం హర్షించదగ్గ పరిణామం. కేసీఆర్ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. ప్రభుత్వ నిర్ణయంతో లక్షలాది కార్మికుల కుటుంబాల జీవితాల్లో సంతోషం వెల్లివిరిస్తుంది. కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

– బజారు భిక్షపతి, కండక్టర్

ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరీశ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ హరీశ్ అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో సోమవారం అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్ రెడ్డి, డీఆర్‌ఓ సంగీతతో కలిసి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ఫారం 6, 7, 8 ద్వారా ఓటరు నమోదు, డిలేషన్స్, కరెక్షన్స్ చేసుకోవచ్చన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బూత్ లెవెల్ అధికారులు అందుబాటులో ఉంటారని, సమ్మర్ రివిజన్‌లో భాగంగా ఆగస్టు 21న డ్రాఫ్ట్ రోల్ పబ్లికేషన్ ఉంటుందని, అక్టోబర్ 4న తుది ఓటరు జాబితా విడుదల చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో మొబైల్ వాహనాల ద్వారా ఈవీఎం యంత్రాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతి నియోజకవర్గంలో నిర్వహించే సమావేశాలకు రాజకీయ పార్టీల నుంచి ప్రతినిధులు హాజరయ్యేలా నాయకులు సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారి, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, బీఆర్ఎస్, బీజేపీ, బీఎస్పీ, సీపీఐ, ఎంఐఎం రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి నిలయంలో కార్గిల్ దివస్



జై హింద్ ఆకృతిలో విద్యార్థులు

రసూల్‌పురా: బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో సోమవారం కార్గిల్ విజయ్ దివస్ వేడుకలను నిర్వహించారు. ఎంసీఈఎంఈ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ జేఎస్. సిధానా పాల్గొని ప్రసంగించారు. వివిధ కళాశాలలు, పాఠశాలలకు చెందిన మూడు వేల మంది విద్యార్థులు ఎన్‌సీసీ క్యాడెట్లు, స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను ఉద్దేశించి సిధానా మాట్లాడుతూ కార్గిల్ యుద్ధ విజయాన్ని వివరించారు. సైనికుల త్యాగాల వల్లే మనం ప్రశాంతంగా ఉండగలుగుతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణాలర్పించిన అమర సైనికుల సంస్మరణార్థం ధ్యాంక్యూ సందేశాలు, రంగోలి, సాంస్కృతిక ప్రదర్శనలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రాష్ట్రపతి నిలయం మేనేజర్ డాక్టర్ రజని ప్రియ రాష్ట్రపతి నిలయం విశేషాలను విద్యార్థులకు వివరించారు. పరిపాలన అధికారి హనీఫ్ ఖాన్, రాష్ట్రపతి నిలయం సిబ్బంది, ఐటీబీపీ, టీఎస్ఎస్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

'ట' మోత @200



సాక్షి, సిటీబ్యూరో: టమాట ధర మోత మోగింది. ఏకంగా కిలో రూ.200కు చేరింది. దీంతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. ఒక్క టమాటే కాదు.. దాదాపు అన్ని కూరగాయల రేట్లు ఎన్నడూ లేనంతగా మండిపోతున్నాయి. సోమవారం బహిరంగ మార్కెట్లో అన్నిచోట్లా టమాటాలను కిలో 200 రూపాయలకు విక్రయించడంతో వినియోగదారులు బిత్తరపోయారు. బీన్స్ సైతం కిలో రూ.200 ధర పలికింది. ఏ కూరలోకైనా విరివిగా వినియోగించే టమాటా ధరలు ముందెన్నడూ ఈ ధరకు కొనలేదని పలువురు వాపోయారు. ఇక అధిక ధరల కారణంగా టమాటా కొనుగోళ్లు భారీగా పడిపోయాయని మరోవైపు వ్యాపారులు అంటున్నారు. ఎవ్వరూ కూడా పావుకిలోకు మించి కొనడం లేదని చెప్పారు. ఇక పచ్చిమిర్చి కిలో రూ.150, మిగతా కూరగాయలు దాదాపు అన్నీ కిలో రూ.100కు తక్కువగా లేవు. ఇటీవలి వర్షాలు, దిగుమతులు పడిపోవడం కారణంగా నగరంలోని ప్రధాన కూరగాయల మార్కెట్లయిన బోయిన్‌పల్లి, గుడిమల్కాపూర్, ఎల్‌బీ నగర్, మాదన్నపేట, సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లకు కూరగాయల సరఫరా 30 శాతానికి తగ్గింది. కొన్ని రకాల కూరగాయలు మండీల జాబితా నుంచి కనుమరుగయ్యాయంటే పరిస్థితిని అంచనా వేసుకోవచ్చు. గతంలో ఎన్నడూ లేని విధంగా టమాటా ధర రికార్డులో నమోదైనట్లు రిటైల్ వ్యాపారులు అంటున్నారు.

పాత పెన్షన్ కొనసాగించాలి



ఆర్డీఓ కార్యాలయంలో అధికారికి వినతి పత్రం అందజేస్తున్న తపస్ నాయకులు

- సీపీఎస్‌ను రద్దుచేయాలి
- విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి
- తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో కొనసాగుతున్న సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని తపస్ (టీపీయూఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి అన్నారు. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సంఘం మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ కార్యాయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. పీఆర్సీ కమిటీ వేసి మధ్యంతర భృతి ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రకటించాలని, ఏరియర్స్‌ను వాయిదాల ప్రాతిపదికన కాకుండా ఏకకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో నంబర్ 57ను అనుసరించి 2002–2003 డీఎస్సీద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు వెంటనే ఓపీఎస్‌ను వర్తింపజేయాలని, 317 జీఓతో స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులకు సొంత జిల్లాలకు అవకాశం కల్పించాలని, సూపర్ న్యూమరీ పోస్టులను మంజూరుచేస్తూ స్పౌజ్ అప్పీళ్లు, జీఓ అమలులో తలెత్తిన అన్ని సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఏకీకృత సర్వీసు రూల్స్ ఇతర అంశాలపై ఉన్న కేసులను కోర్టుద్వారా పరిష్కరించి అన్ని కేటగిరీల్లో పదోన్నతులు, బదిలీలను నిర్వహించాలన్నారు. అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్‌లకు, జూనియర్ లెక్చరర్స్‌కు, డైట్ లెక్చరర్స్‌కు ప్రమోషన్లు ఇవ్వాలని, పండిట్, పీఈటీల అప్‌గ్రేడేషన్‌ను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రత్నారెడ్డి, సత్యం, బాలకృష్ణారెడ్డి, సురేష్‌కుమార్‌గౌడ్, రామకృష్ణ, పతంజలి, రజనీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అసమ్మతి సెగలు

- కల్వకుర్తి బీఆర్ఎస్‌లో అంతర్గత కుమ్ములాటలు
- ఎమ్మెల్యే జైపాల్‌పై తిరుగుబావుటా
- అసమ్మతి నేతల రహస్య సమావేశం
- టికెట్ ఇస్తే ఓడిస్తామంటూ అల్టిమేటం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌పై సొంత పార్టీ నేతలే తిరుగుబావుటా ఎగరేస్తున్నారు. ఇప్పటికే ముఖ్య నేతలతో పాటు క్షేత్రస్థాయిలోని లీడర్లు సైతం రెండు వర్గాలుగా చీలిపోయారు. తరచూ బహిరంగ విమర్శలతో పాటు బాహాబాహికి దిగుతున్నారు. ఎన్నికల గడువు సమీపిస్తుండటం, పార్టీలో అసమ్మతి రాగాలు, అంతర్గత కుమ్మలాటలు అధికమవుతుండటం అధికార బీఆర్ఎస్‌కు తలనొప్పిగా మారింది. క్షేత్రస్థాయిలో ఇంత జరుగుతున్నా అధిష్టానం ఇప్పటి వరకు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం.. నష్టనివారణ చర్యలకు పూనుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది.

తారాస్థాయికి చేరిన విభేదాలు

కల్వకుర్తి నియోజకవర్గం 1989లో ఏర్పడింది. ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా జైపాల్ యాదవ్ ఇప్పటికే మూడుసార్లు విజయం సాధించారు. (1999, 2009లో టీడీపీ నుంచి, 2018లో బీఆర్ఎస్ నుంచి) ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత కల్వకుర్తి వేదికగా పార్టీ సమావేశం నిర్వహించారు. దీనికి ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరయ్యేందుకు రాగా.. ఎమ్మెల్యే వర్గీయులు అడ్డుకున్నారు. అప్పటి నుంచి ఇద్దరి మధ్య ప్రారంభమైన విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. పార్టీ ముఖ్య నేతలే కాదు క్షేత్రస్థాయిలోని ప్రజాప్రతినిధులు, నాయకులు సైతం రెండు వర్గాలుగా విడిపోయారు. కడ్తాల్ జెడ్పీటీసీ దశరథనాయక్, ఆమనగల్లు జెడ్పీటీసీ అనురాధ సహా మెజార్టీ ఎంపీటీసీలు, సర్పంచులు జైపాల్ యాదవ్ వర్గంలో కొనసాగుతుండగా, కడ్తాల్ ఎంపీపీ కమ్లీ మోత్యానాయక్, ఆమనగల్లు ఎంపీపీ అనిత ఎమ్మెల్సీ వర్గంలో కొనసాగుతున్నారు. పలు సందర్భాల్లో ఇరు వర్గాలు పరస్పర దాడులు చేసుకున్న విషయం తెలిసిందే. నియోజకవర్గంపై పట్టు కోసం ఇరు వర్గాల నేతలు ప్రయత్నిస్తున్నారు.

తరచూ ఎమ్మెల్సీ సమావేశాలు

ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఎమ్మెల్యే జైపాల్‌కు వ్యతిరేకంగా వేగంగా పావులు కదుపుతున్నారు. వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేయాలని భావిస్తున్నారు. తరచూ నియోజకవర్గంలోని ముఖ్య నేతలతో సమావేశం అవుతున్నారు. ఈ క్రమంలో తాజాగా ఆదివారం కందుకూరులోని ఓ ఫాంహౌస్ వేదికగా ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలకిషన్‌సింగ్, తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల్ వెంకటేశ్ (స్వతంత్ర అభ్యర్థి) సహా సుమారు 250 మంది ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. వచ్చే ఎన్నికల్లో ఆయనకు టికెట్ ఇవ్వొద్దని, తమ విజ్ఞప్తిని కాదని టికెట్ ఇస్తే ఓడించి తీరుతామని అల్టిమేటం జారీ చేశారు.

చెక్‌పెట్టే వ్యూహంలో ఎమ్మెల్యే వర్గం

ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందిన కడ్తాల్ జెడ్పీటీసీ ఇదే సమయంలో మరో కొత్త అంశాన్ని తెరపైకి తెచ్చారు. ఎమ్మెల్సీ వర్గానికి చెక్ పెట్టే వ్యూహంలో భాగంగానే ఆయన గిరిజన అంశాన్ని తెరపైకి తెచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గంలో మొత్తం 212 తండాలుండగా, వీటిలో గిరిజన ఓటు బ్యాంకు 50 వేలకుపైగా ఉంది. ప్రస్తుతం ముగ్గురు ఎంపీపీలు, ఇద్దరు జెడ్పీటీసీలు, ఇద్దరు వైస్ ఎంపీపీలు, 60 మంది సర్పంచ్‌లు, 15 మంది ఎంపీటీసీలు, ఆరుగురు మున్సిపల్ కౌన్సిలర్లు గిరిజన అభ్యర్థులే కొనసాగుతున్నారు. ఓటు బ్యాంకుతో పాటు క్షేత్ర స్థాయిలో బలమైన కేడర్ ఉన్న లంబాడీ సామాజిక వర్గానికి ఈసారి అవకాశం కల్పించాలని కోరుతూ ఆయన ఈ మేరకు సోమవారం తన నివాసంలో ఆయా ప్రజాప్రతినిధులు,గిరిజన సంఘాల ప్రతినిధులతో సమావేశమై తీర్మానించడం హాట్ టాపిక్‌గా మారింది.

పోటీకి సై అంటున్న ఆశావహులు

సిట్టింగ్ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మళ్లీ తానే పోటీ చేయబోతున్నట్లు ప్రకటించారు. అధిష్టానం ఆశీస్సులతో పాటు పార్టీ కేడర్ మద్దతు తనకే ఉందని, ఎమ్మెల్యే టికెట్ తనకే వస్తుందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి చెబుతున్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేది తానేని ప్రచారం చేసుకుంటున్నారు. మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి తనయుడు ప్రస్తుత కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం కూడా పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆయనతో పాటు వెల్దండ మండలానికి చెందిన బీఆర్ఎస్ నేత గోలి శ్రీనివాసరెడ్డి సైతం టికెట్ ఆశిస్తున్నారు. ఎవరికి వారు గ్రూపులుగా విడిపోయి కార్యక్రమాలు చేపడుతుండడం విశేషం.